క్లుప్తంగా

టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని గడ్డంవారిపల్లె రోడ్డు బైసానీ కల్యాణ మండపం వద్ద టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని శనివారం అగ్నిమాపక అధికారి సుబ్బరాజు పరిశీలించారు. షాపుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చౌడేపల్లెలో 3, సోమలలో 2, కందూరులో 2, పెద్ద ఉప్పరపల్లెలో 2, సదుంలో 3, కల్లూరులో 1 చొప్పున దుకాణాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రైనీ ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి అద్దాలు అందజేస్తున్న దశరథరెడ్డి

వి.కోట: స్థానిక గ్రీన్ సిటీలో శనివారం కళావతి, దశరథరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు అమ్మాయాక్స్ సంస్థ అధినేత దశరథరెడ్డి తెలిపారు. 250 మంది రోగులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. 210 మందికి కంటి అద్దాలు అందజేశామని, 35 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశామన్నారు.

కొలమాసనపల్లిలో పోలీసుల పల్లెనిద్ర


మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లిలో శుక్రవారం రాత్రి స్థానిక సీఐ మురళీమోహన్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, మహిళలపై అఘాయిత్యాలు, ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు, ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన కల్పించారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి


మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే

పలమనేరు: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, అధికారులు, సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతోనే అవార్డు దక్కిందన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి


ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దపంజాణి: ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో బాలాజి తెలిపారు. ఆయన శనివారం పొట్టగానిపల్లిలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. మండలంలో 10142 మందికి గాను 8758 మందికి ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో మండలం రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఏపీవో మురుగేషన్, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యనారాయణ రెడ్డి, పల్లవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించండి

గుడిపాల: మండలంలోని మోపత్తి కనికాపురం వద్ద శనివారం చెన్నై-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవే ఫేజ్-3 మాంటోకార్లో లిమిటెడ్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఎక్స్‌ప్రెస్ హైవే ప్రత్యేక అధికారి అజయ్‌కుమార్ మారియా, ప్రాజెక్ట్ చీఫ్ మేనేజర్ సంసూల హైక్యూ మాట్లాడుతూ చెట్లు అనేక జీవులకు నివాసం కల్పించి కార్బన్‌డైయాక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌చంద్రచటాయి, ఇన్‌చార్జ్ జోలేందర్ సింగ్, అడిషనల్ జనరల్ మేనేజర్ ముఖేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వేధిస్తున్న డాక్టర్ల కొరత

మంచి వైద్యం, విద్య అందించడం ద్వారా పేదలు ఆర్థికంగా వృద్ధి చెందుతారు. జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. ఈ విషయాన్ని గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంది. రూ.కోట్లను ఖర్చు చేసి ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. సిబ్బందిని నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. అధునాతన సౌకర్యాలతో ఆస్పత్రులు వున్నా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వైద్యం అందడం లేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది.

- రోగులకు అందని వైద్యం
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పేదలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


సదుం: సామాజిక వైద్యశాల భవనం

సదుం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.కోట్ల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. అంతేగాక రూ.8 కోట్లతో నూతన ఆస్పత్రి భవనం నిర్మించారు. 2023 అక్టోబరులో ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నిధులు రూ.30 లక్షలతో ఆస్పత్రిలో మార్చురీ, డయాలసిస్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. గతంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని సైతం నియమించారు. మండలంలోని పేద రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇక్కడికి సదుంతో పాటు సరిహద్దులో ఉన్న పులిచెర్ల, సోమల మండలాల ప్రజలు కూడా వచ్చి వైద్య సేవలు పొందేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రి నిర్వహణను గాలికొదిలేశారు. వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ముఖ్యంగా ఆస్పత్రిలో 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుత ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. వారిలో ముగ్గురు పుంగనూరు, చెరుకువారిపల్లె, కల్లూరుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. మరొకరు మెటర్నిటీ లీవులో ఉన్నారు. ఉన్న ముగ్గురు డాక్టర్లే పగలు, రాత్రి సేవలు అందించడం తలకు మించిన భారంగా మారింది. ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ సరాసరి 300లకు పైగా ఓపీలు నమోదవుతున్నాయి. రోగులకు పరీక్షలు నిర్వహించడం ఆలస్యమవుతోంది. రోగం ముదిరి ఇబ్బంది పడుతున్న రోగులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కలెక్టరైనా స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నివేదిక పంపించాం

సీహెచ్‌సీలో డాక్టర్ల కొరత వున్న మాట వాస్తవం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. త్వరలోనే భర్తీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాము.

– డాక్టరు ప్రసాద్ రాజు, మెడికల్ ఆఫీసరు, సదుం


నిండుకుండలా చెన్నారెడ్డిపల్లి చెరువు

చెరువులకు జలకళ

పెద్దపంజాణి: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. రాయల చెరువు, చెన్నారెడ్డిపల్లి చెరువు నిండిపోయి మొరవ పారుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చిత్తూరు జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ఆయన వెంట నిలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసినా పెద్దిరెడ్డి కుటుంబంపై ప్రజలకు వున్న ఆదరణను తగ్గించలేరని తెలిపారు.

–పలమనేరు/గంగవరం/బైరెడ్డిపల్లె/సదుం/చౌడేపల్లె/కుప్పం/పులిచెర్ల(కల్లూరు)/రొంపిచెర్ల/పుంగనూరు/వి.కోట:


చౌడేపల్లె బస్టాండులో పేదలకు అన్నదానం చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, దామోదరరాజు


పుంగనూరులో అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, అనీషారెడ్డి, రాజేష్

- పలమనేరు పట్టణంలోని ఏటీఎం సర్కిల్ వద్ద పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.
- గంగవరంలో పార్టీ మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పార్టీ మాజీ కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.
- బైరెడ్డిపల్లెలో బైరెడ్డిపల్లెలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.
- సదుంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.
- చౌడేపల్లె బస్టాండులో చౌడేపల్లె యూత్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదర రాజు, మండల కన్వీనర్ జి.నాగభూషణరెడ్డి, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, అంజిబాబు అన్నదానం చేశారు.
- కుప్పంలో వున్న ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు హఫీజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేపట్టారు.
- పులిచెర్ల(కల్లూరు)లో కల్లూరు, పులిచెర్ల, మంగళంపేటలో ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.
- రొంపిచెర్లలోని జీకే ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.
- పుంగనూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, కొండవీటి నాగభూషణం, శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మిథున్ యువసేన అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.


వి.కోట: కేకు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న పీఎన్ నాగరాజు

- వి.కోటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని వికోటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం


పుంగనూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న అనీషారెడ్డి


చౌడేపల్లెలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనూషారెడ్డి


రొంపిచెర్ల : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ

పుంగనూరు/చౌడేపల్లె : కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ శనివారం వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపడుతున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ పరిశీలకురాలు నూతనకాల్వ అనూషారెడ్డి తెలిపారు. ఆమె శనివారం పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, కొండవీటి నాగభూషణం, చౌడేపల్లెలో ఎస్.శ్రీనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జి.నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పేద పిల్లలకు వైద్య విద్య అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని తెలిపారు. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూడడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు తీరుకు నిరసనగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం కళాశాలల ప్రయివేటీకరణ నిలిపేయాలని కోరుతూ గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. పుంగనూరులో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, జిల్లా యూత్‌వింగ్ కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, చౌడేపల్లెలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కోఆప్షన్ మెంబర్ సాధిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

రొంపిచెర్ల: మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం రొంపిచెర్లలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నవంబరు 22 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలపారు. ఈ నెల 28న నియోజవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, కోటా వెంకటరమణ, గుండ్లూరి రామచంద్రారెడ్డి, రామనారాయణ రెడ్డి, కరీముల్లా, రవీంద్ర, అమరనాథరెడ్డి, యర్రంరెడ్డి, బాలాజీ, గురు, సుబ్బన్న, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో రాజుపల్లి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పెద్దపంజాణి: పుంగనూరు నియోజకవర్గం సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని రాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం జనార్ధన రెడ్డి తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో చరణ్ ప్రథమ స్థానం, షాట్ పుట్‌లో చరణ్ ప్రథమ స్థానం, రంజిత్ తృతీయ స్థానం, డిస్కస్ త్రోలో ముఖేష్ ప్రథమ స్థానం, చరణ్ ద్వితీయ స్థానం, హైజంప్‌లో చరణ్ ప్రథమ స్థానం, వంద మీటర్ల పరుగు పందెంలో చరణ్ తృతీయ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు పీఈటీ దొరైని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు రంజిత్, ముఖేష్, చరణ్

టీడీపీ నేతలకు కుటీర పరిశ్రమల్లా బెల్టు షాపులు

- ములకలచెరువు ఘటనలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వాటా
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: రాష్ట్రంలో కూటమి నేతలకు బెల్టు షాపులు, నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమల్లా మారాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం చౌడేపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ పరిశ్రమపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. నకిలా మద్యం తయారీలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వాటా వుందని స్థానికులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ మద్యం కేసులో అరెస్టు చేశారని, నకిలీ మద్యం తయారీ కేసులో ఆ పార్టీ నేతలను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు.

ఆరోగ్యశ్రీ సేవల బంద్ కొనసాగింపు

కాణిపాకం: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కూడా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అయ్యాయి. ఆరు నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను నిలుపుదల చేశాయి. అలాగే పలు డెంటల్ ఆస్పత్రులు సేవలు అందించలేదు. ఆరోగ్యశ్రీ సేవల కోసం వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. ఆస్పత్రులకు చుట్టూ తిరిగారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నారు. మరికొందరు ఇంటి బాట పట్టారు. బకాయిలు మంజూరయ్యే వరకు సేవలు కొనసాగించేది లేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే బంద్ ప్రక్రియను ఉద్ధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాయి.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పూతలపట్టు(యాదమరి): మండల కేంద్రమైన పూతలపట్టులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు లక్ష్మీపతి తెలిపారు. ఇందులో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారిని చెన్నై తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తారని వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్‌కార్డు తీసుకురావాలని చెప్పారు.

రేపు బంగారుపాళెంలో..

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెన్నై శంకర్‌నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

యథేచ్ఛగా అక్రమ క్వారీల నిర్వహణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పచ్చనేతలు రెచ్చిపోతున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతూ అవకాశం వున్న మేరకు డబ్బు సంపాదించుకుంటున్నారు. కుప్పం ప్రాంతంలో అక్రమ మైనింగ్, పలమనేరు ప్రాంతంలో జల్లి క్వారీలు అనధికారికంగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ హైవే పనులకోసమంటూ అడవుల్లోని గుట్టలను బ్లాస్టింగ్ చేసి జల్లిని తరలిస్తున్నారు. కోర్టులో కేసులున్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయం తెలిసినా మైనింగ్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు.

- ఎటుచూసినా స్టోన్ క్రషింగ్, జల్లి అమ్మకాలు
- ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కోసమంటూ క్రషింగ్
- నోరు మెదపని మైనింగ్ అధికారులు



పలమనేరు మీదుగా తమిళనాడుకు వెళుతున్న గ్రానైట్ లారీ, కుప్పం ప్రాంతంలో నిర్వహిస్తున్న అక్రమ క్వారీ

పలమనేరు: నియోజకవర్గంలోని పలమనేరు మైనింగ్‌శాఖ పరిధిలో పలుచోట్ల క్వారీలున్నాయి. వీటిల్లో దేనికి లైసెన్సు వుంది. ఏది అక్రమంగా నడుస్తోందన్న విషయం మైనింగ్ అధికారులు తెలియడం లేదు. ఎక్కడపడితే అక్కడ మైనింగ్ చేస్తున్నారు. మరోవైపు తమిళనాడు రాష్ట్రానికి రాత్రిపూట గ్రానైట్ దిమ్మెలను లారీల్లో తరలిస్తూనే ఉన్నారు. ఇవన్నీ స్థానిక మైనింగ్ కార్యాలయం ముందే వెళ్లడం కొసమెరుపు. అదేవిధంగా బైరెడ్డిపల్లి మండలంలోని అటవీప్రాంతంలో ఒక వ్యక్తి తనకు అధికారపార్టీ నేతల అండ ఉందంటూ ఇష్టానుసారంగా బండలను బ్లాస్టింగ్ చేసి జల్లి, కట్టడపు రాళ్లను రవాణా చేస్తున్నాడు. మరో వ్యక్తి ఇదే మండలంలోని జాలారిపల్లి అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గుట్టను ఆక్రమించుకుని స్టోన్ క్రషింగ్ చేస్తున్నాడు. ఇక్కడి నుంచి నిత్యం ప్రధాన రహదారి మీదుగా గంటకు నాలుగైదు టిప్పర్లు తిరుగుతూనే ఉన్నాయి. ఇక మాదిగబండ క్వారీ విషయం హైకోర్టులో ఉన్నా ఒక టీడీపీ నేత నిత్యం భారీగా జల్లిని కొట్టి విక్రయిస్తున్నాడు. ఇవేగాక ఎక్స్‌ప్రెస్ హైవేకోసమంటూ స్టోన్ క్రషింగ్‌లు నడుస్తూనే ఉన్నాయి. ఈ విషయమై చిత్తూరు మైనింగ్ శాఖ డీడీ సత్యనారాయణను వివరణ కోరగా తమ సిబ్బంది ద్వారా విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కోర్టులో కేసున్నా కొనసాగుతున్న మాదిగబండ స్టోన్ క్రషింగ్ యూనిట్, జల్లిని తరలిస్తున్న టిప్పర్

ఘనంగా పెరటాశి పూజలు

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో పెరటాసి మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉపవాసాలు ఉండి, తిరునామాలతో ఇళ్లలో నైవేద్యం సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీవారు